# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.**
2. **ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ చిత్తూరు జిల్లాలోని కుంకీ ఏనుగుల శిబిరాన్ని సందర్శించారు.**
3. **96 గిరిజన గ్రామాలకు రహదార్ల నిర్మాణం కోసం 28 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు.**
4. **ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.**
5. **జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు.**

==========================

విశాఖపట్నంలో నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చిస్తారు.

--------------------------

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ చిత్తూరు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈరోజు పలమనేరులోని కుంకీ ఏనుగుల శిబిరాన్ని సందర్శించారు. అనంతరం అటవీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

--------------------------

96 గిరిజన గ్రామాలకు రహదార్ల నిర్మాణం కోసం 28 కోట్లు రూపాయల నిధులు మంజూరయ్యాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గ్రామాలంటే ఒకప్పుడు డోలీ మోతలే కనపడేవని కానీ కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు ఆ ప్రాంతాలు పర్యాటక అనుభూతిని అందిస్తున్నాయని పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాలకు గుర్తింపు రానుందని ఆమె అభిప్రాయపడ్డారు.

--------------------------

వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు

ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన చెక్కులను మంత్రి ఈరోజు అందజేశారు. గత 16 నెలల కాలంలో ఒక్క పాలకొల్లు నియోజకవర్గంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 8 కోట్ల 50 లక్షల రూపాయలు అందజేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవితతో కలిసి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలెవరూ వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రజలకు సకాలంలో సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. 42 మంది లబ్ధిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. కింద మంజూరైన 38 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు వివరించారు.

---------------------------

సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలను అందించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం - 1987 అమలులో భాగంగా న్యాయ సేవాధికార సంస్థలు స్థాపించబడ్డాయి. ఈ చట్టం 1995 నవంబర్ 9వ తేదీన అమల్లోకి వచ్చినప్పటి నుండి ఈ రోజును ప్రతి ఏటా జాతీయ న్యాయ సేవల దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ రోజున, దేశవ్యాప్తంగా న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం, ఇతర సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిబిరాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ధ్యానం కొనుగోలు చేసిన తర్వాత రోజుల వ్యవధిలోనే రైతులకు సొమ్ము చెల్లిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో కోటి 50 లక్షల రూపాయలతో అంతర్గత రహదారుల అభివృద్ధికి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గొల్లపూడి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు విక్రయానికి తెచ్చిన ధాన్యాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - 2026 అమలు కోసం ఎల్లుండి నుంచి నాలుగు రోజుల పాటు ఎన్నికల అధికారులకు దృశ్య, శ్రవణ మాధ్యమ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల బూత్ స్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ నిర్వహిస్తామన్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆయా జిల్లాల్లో ఎన్నికల అధికారులు వారికి కేటాయించిన స్థానాల నుంచి తప్పనిసరిగా దృశ్య శ్రవణ మాధ్యమ శిక్షణకు హాజరుకావాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. నెల్లూరులో జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో.. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి ..డాక్టర్ పొంగూరు నారాయణలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ... పంటల నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారని త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులకు తగిన సాయం అందిస్తామన్నారు. దెబ్బతిన్న రోడ్లకు  మరమ్మతులు చేస్తామన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు పరిహారం కోసం ప్రభుత్వం 46 కోట్ల రూపాయల మొత్తాన్ని మంజూరు చేసినట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. 2020 – ఏప్రిల్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన ఒక వెయ్యి 150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు విడుదల చేసిన  మ్యాచింగ్ గ్రాంట్  ను  ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి ఖాతాకు జమ చేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరణించిన ఒక్కొక్క న్యాయవాది కుటుంబానికి పరిహారంగా 4 లక్షల రూపాయల చొప్పున కుటుంబ సభ్యులకు అందజేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొంటూ..

వాయిస్ 33 సెకన్లు

====================